సాక్షి
మంచిర్యాల
గురువారం । 4 । జనవరి । 2024



పండుగకు ప్రత్యేక బస్సులు
ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చేందుకు యాజమాన్యం అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది. సంక్రాంతికి ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.
8లో▸

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంపల్లి: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలపై టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0 /17.0

వాతావరణం
ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి వేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

బియ్యం బస్తాలు మాయం!

జిల్లాలో రేషన్ బియ్యం సరఫరాలో పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష సాక్షంగా నిలిచే ఘటన ఇదీ. మంగళవారం స్టేజీవన్ గోదాం నుంచి మంచిర్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు సరఫరా చేయాల్సిన బియ్యం లారీలోని బస్తాలు చోరీకి గురయ్యాయి. గోదాం పరిసరాల్లోనే గుర్తు తెలియని వ్యక్తులు బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లారు. బియ్యం బస్తాలు దొంగలపాలైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు బయటకు పొక్కకుండా చేస్తున్నారు. అంతేగాక తమ అలసత్వాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. ఈ లారీ లోడ్‌లో 80బస్తాల బియ్యం దొంగలపాలైనట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో పౌరసరఫరాల శాఖ పంపిణీపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా ఏకంగా రేషన్ బస్తాలే చోరీకి గురి కావడం ఆ శాఖ పనితీరును చెప్పకనే చెబుతోంది.

- ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్దే బస్తాల చోరీ
- స్టేజీవన్ నుంచి గోదాం వచ్చాక ఘటన
- బయటకు పొక్కకుండా ఉండేలా ప్రయత్నాలు
- కప్పిపుచ్చుకునేందుకు కాంట్రాక్టరు సెటిల్మెంట్?



నస్పూర్‌లోని తీగల్‌పహాడ్‌లో బియ్యం బస్తాలు మాయమైంది ఈ లారీ నుంచే



చిందర వందరగా వేసి ఉన్న బియ్యం బస్తాలు



చోరీకి గురైన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఎం గోపాల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా పౌరసరఫరాల శాఖ రేషన్ రవాణాలో అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. తాజాగా మరో ఘటన చోటు చేసుకుంది. మందమర్రి స్టేజ్ వన్ గోదాం నుంచి బియ్యం రవాణా చేస్తున్న లారీ నుంచి నస్పూర్ పరిధిలోని తీగల్‌పహాడ్‌లో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింటుకు చేరాక బియ్యం బస్తాలు మాయమయ్యాయి. స్టేజ్ వన్ నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్ల వరకు బియ్యం బస్తాలు రవాణా చేయడం సంబంధిత కాంట్రాక్టర్ బాధ్యత. సాయంత్రమైందని డ్రైవర్ గోదాం పరిసరాల్లో లోడ్‌తో ఉన్న లారీ నిలిపి వెళ్లారు. తెల్లవారి వచ్చి చూస్తే బస్తాలపై కప్పి ఉన్న కవర్ తీసి ఉండడం, అందులో బస్తాలు మాయం కావడం, సమీప ప్రాంతంలోనే బియ్యం బస్తాలు ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు అర్థమవుతోంది. ఇక్కడ కనీస భద్రత కోసం సీసీ కెమెరాలు, సీసీటీవీలు కూడా లేకపోవడం గమనార్హం.

మారని శాఖ తీరు

పౌరసరఫరాల శాఖలో అనేక సందర్భాల్లోనూ ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినప్పటికీ ఆ శాఖ పనితీరులో మార్పు రావడం లేదు. జిల్లా పరిధిలో ప్రతీ సీజన్‌లో ధాన్యం సేకరణ నుంచి మిల్లర్లకు సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) చేసే క్రమంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో మంచిర్యాలం ఎంఎల్‌ఎస్(మండల స్థాయి గోదాం) వేంపల్లి పరిధిలో ఉన్నప్పుడు అక్కడ వందల క్వింటాళ్ల కొద్దీ బియ్యం మాయమయ్యాయి. దీనిపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ శాఖ సైతం విచారణ చేపట్టారు. చర్యల్లో భాగంగా అప్పటి ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్చార్జిని విధుల నుంచి కొద్ది నెలల పాటు తప్పించారు. తర్వాత మళ్లీ యథాతథంగా సాగుతోంది. జిల్లా పరిధిలో 18మండలాల్లో 471 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 2.19లక్షల రేషన్‌కార్డులు ఉండగా, మొత్తం 63.95లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. సుమారు 35వేల క్వింటాళ్ల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. ఈ బియ్యం సీఎంఆర్ కింద మిల్లర్లు ఇచ్చినవి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గోదాంలకు అందిస్తాయి. జిల్లాలో బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రిలో స్టేజ్ వన్ గోదాంల నుంచి మండల స్థాయిలో ఉన్న పాయింట్లకు సరఫరా చేయాలి. ఇందుకోసం స్టేజ్ వన్ స్థాయిలో బియ్యం రవాణాకు ఓ కాంట్రాక్టరు, స్టేజ్–2 అంటే ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసేందుకు మరో రవాణా కాంట్రాక్టర్లు ఉన్నారు. వీరు నిర్ణీత సమయంలో ఈ బియ్యాన్ని స్టేజ్ వన్, స్టేజ్ టు గోదాంలకు సకాలంలో చేరవేయాలి. కాంట్రాక్టర్లు సరిపడా లారీలు సమకూర్చకుండా ఉండడంతో రోజుల తరబడి డీలర్లకు బియ్యం చేరడం లేదు. మరోవైపు బియ్యం చేరవేయడంలో జాగ్రత్తలు లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. జిల్లా పౌర సరఫరాల శాఖకు ఇన్చార్జి అధికారిగా ఉండడంతోనూ పాలన గాడి తప్పుతోంది.

ఫిర్యాదు చేయని కాంట్రాక్టరు

ఎక్కడైనా దొంగతనం జరిగితే వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారు. ఇక్కడ ప్రజల సొమ్ము దొంగలపాలైనా సంబంధిత కాంట్రాక్టర్ గానీ ఇటు పౌరసరఫరాల అధికారి గానీ ఫిర్యాదు చేయలేదు. మరోవైపు ఈ ఘటనను తక్కువగా చేసి చూపేందుకు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట ఎక్కువ బస్తాలని, సాయంత్రం వరకు రెండు.. అసలు బస్తాలే చోరీ కానట్లు.. మూడు క్వింటాళ్లుగా చూపే ప్రయత్నాలు చేశారు. దీనిపై రవాణా చేస్తున్న కాంట్రాక్టర్ సంబంధిత అధికారులను మేనేజ్ చేస్తూ తప్పుదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎందుకంటే జిల్లాలో ఓ రైస్‌మిల్లర్ యజమాని స్టేజీవన్ రవాణా కాంట్రాక్టర్‌గా అనధికారికంగా పని చేయడంతో ఇది బయటపడుతుందనే కారణంతోనే లోలోపల ఈ తతంగం పూర్తి చేసేందుకు సెటిల్ చేసుకుంటున్నారు. మరోవైపు ఆ బియ్యం బస్తాల స్థానంలో తమ మిల్లుల నుంచి బియ్యం బస్తాలను తెప్పించి కథ ముగించే పనిలో ఉన్నారు.

ఘటనపై నివేదిక ఇస్తాం

తీగల్‌పహాడ్‌లో ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో లారీ నుంచి బియ్యం బస్తాలు కనిపించకపోవడం మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రాథమికంగా వివరాలు తీసుకున్నాం. ఆ బియ్యం బస్తాలు పక్కకు పెట్టాలని చెప్పాం. స్టేజ్ వన్ నుంచి స్టేజ్–2 లారీ వచ్చే వరకు ఎన్ని బస్తాలు లేవనేది వివరాలు తీసుకుని ఓ నివేదిక ఇస్తాం.
– గోపాల్, డీఎం, పౌరసరఫరాల శాఖ

సీపీ రెమా రాజేశ్వరి బదిలీ

- విధి నిర్వహణలో ప్రత్యేకత
- రామగుండం కొత్త సీపీగా ఎల్‌ఎస్ చౌహన్



బదిలీపై వెళ్తున్న సీపీ రెమా రాజేశ్వరి



సీపీగా రానున్న ఎల్.ఎస్ చౌహన్

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి బదిలీ అయ్యారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో భారీగా బదిలీలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 23మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెమా రాజేశ్వరి స్థానంలో రామగుండం పోలీసు కమిషనర్‌గా 2009 బ్యాచ్‌కు చెందిన జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ ఎల్‌ఎస్ చౌహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమార్కులపై ఉక్కు పిడికిలి

రామగుండం పోలీసు కమిషనరేట్‌లో తొలి ఐపీఎస్ మహిళా అధికారి రెమా రాజేశ్వరి తనదైన ముద్ర వేశారు. కమిషనరేట్ ఏర్పాటు నుంచి ముగ్గురు ఐపీఎస్‌లు పోలీసు కమిషనర్‌లుగా పని చేశారు. గత ఏడాది జనవరి 27న పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె 11 నెలలపాటు ఇక్కడ తనదైన శైలిని ప్రదర్శించారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేకతను చాటుకున్నారు. మహిళల భద్రత కోసం షీటీమ్, మహిళా ప్రయాణికులు, ఆటోలో ప్రయాణించే వారి భద్రత కోసం అభయ యాప్, వయోవృద్ధులు రక్షణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ వాలంటీర్ టీమ్‌లు ఏర్పాటు, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులు నేరుగా కలిసే అవకాశం కల్పించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. 300 మంది మహిళా స్పెషల్ కమెండోలతో భద్రత కల్పించారు. ఎన్నికల సమయంలో మావోయిస్టుల లేఖల కలకలం, ఇందారం వద్ద మావోయిస్టులకు సహకరించిన ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంలో సాంకేతికతను వినియోగించి సత్తా చాటారు.

న్యూస్‌రీల్

అర్హులందరికీ పథకాలు



బెజ్జాల గ్రామంలో దరఖాస్తుల స్వీకరణ

జైపూర్: అర్హులైన ప్రజలందరికీ పథకాలు అందిస్తామని, రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని బెజ్జాల, పౌనూర్ గ్రామాల్లో బుధవారం ప్రజా పాలన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లల్లో ఒక్కరికి కూడా ఇళ్లు రాలేదని వాపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లే ఉన్నాయని, మళ్లీ ఇప్పుడు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఒక్క దరఖాస్తు ద్వారా ఐదు గ్యారంటీల పథకాలు అందిస్తామని అన్నారు. త్వరలో మిషన్ భగీరథపై సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సంతోష్‌ను కోరారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పొలాలు, ఇళ్లు ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. స్థానిక నాయకులు పలు భూ సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం వాటి పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. డీఆర్‌డీఏపీ శేషాద్రి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై సీపీ రెమారాజేశ్వరి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా 'సైబర్ జాగృతి దివాస్' అనే కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ క్రైమ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోతున్నారని, విద్యావంతులు మొదలుకుని సామాన్య ప్రజలు, విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.

12న కస్టోడియల్ డెత్‌పై న్యాయ విచారణ

మంచిర్యాలక్రైం: జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన కీర్తి అంజి కస్టోడియల్ డెత్‌పై ఈ నెల 12న ఉదయం 11గంటలకు న్యాయ విచారణ నిర్వహించనున్నట్లు ఆర్డీవో రాములు తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో న్యాయ విచారణ ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని
- ఘనంగా సావిత్రీబాయిపూలే జయంతి



చిత్రపటానికి నాయకులు, మహిళల నివాళి

పాతమంచిర్యాల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని తెలంగాణ బీసీ జాగృతి, జ్యోతిబా పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను చదివించాలని, చదువే వారిని సంస్కారవంతులుగా చేస్తుందని తెలిపారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమాజం, చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జడ్జి ఉపనిషద్వనితోపాటు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, బీసీ జాగృతి నాయకులు నీలి శ్రీనివాస్ తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి కోశాధికారి సల్ల విజయ్‌కుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆకుతోట పద్మాదేవి, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, కౌన్సిలర్లు మేరుగు మహేశ్వరీ, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు. సావిత్రీబాయి పూలే వేషధారణ, వేణుగానం చేసిన కరీంనగర్‌కు చెందిన రాజారమేష్‌ను అభినందించారు.

ఖాళీ జాగా.. కబ్జా



భూ ఆక్రమణ కోసం పాతిన సిమెంట్ స్తంభాలు

- లయన్స్‌క్లబ్‌కు కేటాయించిన భూమినీ వదల్లేదు
- ఆగని భూ ఆక్రమణలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో భూ కబ్జాల పరంపర సాగుతోంది. ప్రభుత్వ, సింగరేణి భూమి ఖాళీగా కనిపిస్తే చాలు అక్రమార్కుల చేతుల్లో కబ్జాకు గురవుతోంది. గుట్టుగా కబ్జా పర్వానికి తెర తీస్తుండడంతో బెల్లంపల్లిలో ప్రభుత్వ భూమి కనిపించకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పలు చోట్ల భూ ఆక్రమణలు జరుగగా.. తాజాగా లయన్స్‌క్లబ్‌కు ప్రభుత్వం కేటాయించిన భూమి ఆక్రమణకు యత్నించిన ఘటన వెలుగు చూసింది. విలువైన భూమి కావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

డయాలసిస్ కేంద్రం కోసం..

స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్‌కు హైదరాబాద్–చంద్రాపూర్ జాతీయ రహదారి పక్కన 2016లో ప్రభుత్వం భూమి కేటాయించింది. సర్వేనంబరు 170లో ఉన్న 1.10 ఎకరాలు అప్పటి కలెక్టర్ కేటాయించినట్లు సమాచారం. ఆ స్థలంలో కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలందించాలని క్లబ్ నిర్వాహకులు భావించారు. ఇందుకోసం డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానిక దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ ప్రయత్నాలు కొలిక్కి రాక డయాలసిస్ కేంద్రం మంజూరు కాలేకపోయింది.

పక్కా భవనం నిర్మాణం

ఓ వైపు ప్రభుత్వానికి డయాలసిస్ కేంద్రం కోసం దరఖాస్తు చేసుకుని ప్రయత్నాలు చేస్తుండగానే మరోవైపు లయన్స్‌క్లబ్ నిర్వాహకుల్లో ఒకరైన ఆప్కో రాష్ట్ర మాజీ చైర్మన్ గడ్డం జగన్నాథం ముందుకు వచ్చి తన భార్య గడ్డం రాధ స్మారకార్థం మెమోరియల్ భవన్‌ను నిర్మించారు. ఎలాగైనా సరే డయాలసిస్ కేంద్రం మంజూరవుతుందనే ఆశతో ఆ భవన నిర్మాణం తలపెట్టారు. ఇందుకోసం రూ.6లక్షలకు పైగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం నుంచి అనుమతి లభించకపోవడంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుపై ఆశలు అడియాశలయ్యాయి. అప్పటి నుంచి డయాలసిస్ కేంద్రం కోసం కేటాయించిన స్థలంలో కార్యకలాపాలు నిలిచాయి. ప్రతిపాదిత డయాలసిస్ కేంద్రం స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. ఏళ్లుగా ఎవరూ తొంగి చూడలేదు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములకు డిమాండ్ రావడంతో ఇటీవల గుట్టుగా కొందరు కబ్జా ప్రయత్నాలు చేశారు.

సిమెంట్ స్తంభాలు పాతి

డయాలసిస్ కేంద్రానికి చెందిన భూమిపై కన్నేసిన కొందరు ఫెన్సింగ్ హద్దులు దాటి కబ్జా చేశారు. ఖాళీగా ఉన్న కొన్ని గుంటల భూమిని ఆక్రమించి కందకాలు తవ్వి సిమెంట్ స్తంభాలు పాతారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కాకపోవడం, క్లబ్ కార్యకలాపాలు జరగకపోవడంతో అక్రమార్కుల కన్ను ఆ భూమిపై పడింది. రాత్రికి రాత్రే సిమెంట్ స్తంభాలు పాతడంతో భూ కబ్జా యత్నాలు వెలుగు చూశాయి. రూ.లక్షలు విలువ చేసే భూమిని తేరగా దురాక్రమణ చేయడానికి కబ్జారాయుళ్లు కుట్ర పన్నడం చర్చనీయాంశంగా మారింది.

డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు యత్నాలు

డయాలసిస్ కేంద్రం మంజూరు కాకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా ఉండకుండా వినియోగంలోకి తేవాలని లయన్స్ క్లబ్ నిర్వాహకులు భావిస్తున్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేసి పేదలకు సేవలు అందించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆక్రమణకు గురైన భూమిని తిరిగి లయన్స్‌క్లబ్ ఆధీనంలోకి తెచ్చుకుని ఆ తర్వాత డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్నారు. మరి భూ ఆక్రమార్కులు ఏ తీరుగా వ్యవహరిస్తారో చూడాల్సిందే.

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం

డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేశాం. అనివార్య కారణాలతో మంజూరు కాలేదు. అప్పటికే రూ.6లక్షలు పైగా వెచ్చించి పక్కాభవనం నిర్మించాను. ఎవరూ ఆ భూమిని కబ్జా చేయడానికి వీలు లేదు. భవనంలో ప్రజాహిత కార్యక్రమాలు చేపడతాం. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాను. డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహణకు సమాలోచనలు జరుగుతున్నాయి.
– గడ్డం జగన్నాథం, భవన నిర్మాణదారు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ

- ప్రభుత్వ స్థలంలో అక్రమంగా బోరు
- రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కబ్జాలు



కత్తరశాల రోడ్డులో కబ్జాదారులు వేసిన బోరు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన భూములు ఆక్రమణకు గురవుతన్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్లు 863, 869, 868లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతున్నా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ పరిధిలోని గెర్రెకాలనీ, జాతీయ రహదారిని ఆనుకుని ఆయా సర్వేనంబర్లతోపాటు మరికొన్ని సర్వేనంబర్లలో గతంలో 300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం గర్రై ప్రాంతంలో ఎకరం ఖాళీ స్థలం లేకుండా అక్రమార్కులు కబ్జా చేశారు. ముందు ఖాళీ స్థలంలో బోర్లు వేసి, షెడ్లు నిర్మించి ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. అమాయకులకు విక్రయించి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఖాళీ స్థలాలను అక్రమార్కుల కన్ను పడింది. భూ కబ్జాల్లో రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో కొందరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల హస్తం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వం భూముల రెగ్యులరైజేషన్ కోసం 58, 59 జీవోలు ప్రవేశపెట్టింది. ఈ వెసులుబాటును అక్రమార్కులు సద్వినియోగం చేసుకున్నారు. గెర్రై కాలనీలో ఉన్న రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కావడం గమనార్హం. సర్వే నంబరు 863లో 2.20 ఎకరాలు జర్నలిస్టులకు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. అదే స్థలంలో నేడు రాత్రికి రాత్రే బోరు వేసి కబ్జాకు సన్నద్ధమవుతున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీలో 'సమ్మె'ట..!

- అద్దె బస్సుల యజమానుల సన్నద్ధం
- రేపటి నుంచి బస్సుల నిలిపివేతకు నిర్ణయం
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



మంచిర్యాల ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న అద్దెబస్సుల యజమానులు

మంచిర్యాలఅర్బన్: సుదీర్ఘ కాలం తర్వాత ఆర్టీసీలో అద్దె బస్సుల యజమానులు సమ్మెకు సన్నద్ధం అవుతున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5నుంచి సమ్మెకు అద్దె బస్సుల నిర్వాహకుల నిర్ణయంతో బస్సులు నిలిచిపోనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9న మహలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతించడంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ రెట్టింపైంది. 50శాతం నిండని బస్సుల్లో 75శాతం నుంచి 80 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఏ బస్సుల్లో చూసినా పరిమితికి మించి 110 నుంచి 120 మంది ప్రయాణం చేస్తున్నారు. నిబంధనల మేరకు పల్లె వెలుగు బస్సుల్లో 56, ఎక్స్‌ప్రెస్‌ల్లో 51మంది ప్రయాణికులకే మాత్రం బీమాను యజమానులు చెల్లిస్తూ వస్తున్నారు. అంతకు మించి ప్రయాణికులు పెరిగినా బీమా వర్తించదని, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే నష్టపరిహారం బాధ్యత ఎవరిదనే ప్రశ్న లేవనెత్తుతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు భారం పడి.. వేగం తగ్గిపోతుందని బస్సుల యజమానులు వాపోతున్నారు. ఈ నెల 5నుంచి ఆర్టీసీలో సమ్మెతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురు కానున్నాయి.

309 బస్సులకు బ్రేక్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 606 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర వేస్తున్నారు. ఇందులో 303 అద్దె బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆదిలాబాద్‌లో 60, మంచిర్యాలలో 69, నిర్మల్‌లో 77, భైంసాలో 49, ఆసిఫాబాద్‌లో 31, ఉట్నూర్‌లో 23 అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఈ లెక్కన సంస్థ పరిధిలో నడిచే బస్సుల్లో సగం అద్దె బస్సులే అన్నమాట. మహలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత బస్సులు సరిపోవడం లేదు. కొన్ని రూట్లలో ఏ బస్సులో చూసినా రద్దీ తగ్గడం లేదు. పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని కొత్త బస్సులు రావాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో ఆర్టీసీలో అద్దె బస్సులు సగానికి పైగా సమ్మెకు వెళ్తే పరిస్థితి ఏమిటనేది తెలియాల్సి ఉంది.


సమ్మె నోటీసు..

తమ డిమాండ్లు పరిష్కరించాలని అద్దెబస్సుల యజమానులు సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే అద్దె బస్సుల యజమానుల సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం ఉండడంతో ఇబ్బందులు తప్పేలా లేదు. ఆర్టీసీలో సగం బస్సులు అద్దె బస్సులే కావడంతో సమ్మెకు వెళ్తే ఎలా అనేదానిపై చర్చ సాగుతోంది. మొత్తం బస్సులు తిప్పితేనే కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోంది. అలాంటిది సగం బస్సులు నిలిచిపోతే ఎలా ఉంటుందో వేచి చూడాలి.

డిమాండ్లు ఇవిగో..

- మహలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగి విపరీతమైన డీజిల్ భారం పడుతోంది. ప్రస్తుతం ఉన్న కేఎంపీఎల్ రావడం లేదు. కేఎంపీఎల్‌ను తగ్గించాలి.
- పల్లెవెలుగు 56, ఎక్స్‌ప్రెస్ 51 సీట్ల సామర్థ్యం ఉంది. ప్రయాణికుల సంఖ్య పెరిగి 100 నుంచి 120 ఉంటోంది. ప్రయాణికుల బీమా చెల్లింపులను ఆర్టీసీ యాజమాన్యం భరించాలి.
- పరిమితికి మించి సామర్థ్యం ఉన్నప్పుడు టైర్లు వేడి అయి పేలే అవకాశాలున్నాయి. కొత్త టైర్లు బల్క్ రేట్లకు ఇవ్వాలి.
- ఓవర్‌లోడ్ కారణంగా బస్సుల నిర్వహణ విపరీతంగా పెరిగిపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఇస్తున్న ఫ్లోర్ రేటుకు అదనంగా కిలోమీటరుకు రూ.మూడు పెంచాలి.

బస్సుల యజమానులను ఆదుకోవాలి



ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సుల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి. ఓవర్ లోడ్‌తో బస్సుల వేగం తగ్గిపోవడం.. టైర్లు, చిన్న చిన్న మరమ్మతుల కారణంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈ నెల 5నుంచి తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నాం. మా డిమాండ్లపై యాజమాన్యం తక్షణమే స్పందించి పరిష్కరించాలి.
– నర్సయ్య, ఆర్టీసీ అద్దెబస్సుల యాజమాన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

న్యాయవాది సంగీతకు ఐకాన్ అవార్డు


అవార్డుతో సంగీత

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన మహిళా న్యాయవాది నల్లుల సంగీత అంతర్జాతీయ ఐకాన్ అవార్డు అందుకున్నారు. బుధవారం పూలే జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, ఎంబీసీ, డీఎస్‌టీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 193 మందికి ఐకాన్ అవార్డులు ప్రదానం చేశారు. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సంగీత అవార్డు అందుకున్నారు.

ఆర్మీ బాయ్స్ స్పోర్ట్ కంపెనీ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్స్, అడ్మిషన్ల కోసం ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ సెంటర్, బెంగళూరు వారిచే బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ప్రమాదవశాత్తు సామగ్రి దగ్ధం


కాలిన ఇంటి సామగ్రి

జైనూర్: మండలంలోని మాని కొలాంగూడలో ఆత్రం మారు అనే రైతు ఇంట్లో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 5 క్వింటాళ్ల పత్తి, ఇంట్లోని సామగ్రి దగ్ధమయ్యాయి. గమనించిన గ్రామస్తులు మంటలు అదుపు చేశారు. ఎస్సై సందీప్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దీపాదాస్ మున్షీకి పీఎస్సార్ సన్మానం


దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) బుధవారం హైదరాబద్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు.

జిల్లా అటవీ అధికారిని కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు


పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా టీఎన్జీవోస్ సభ్యులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా ఫారెస్టు అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఏసీఎఫ్ ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహులను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, అటవీశాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, సంయుక్త కార్యదర్శి వెంకటకృష్ణ, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సభ్యులు రవికిరణ్ పాల్గొన్నారు.

పండుగకు ప్రత్యేక బస్సులు

- సంక్రాంతికి ఆదిలాబాద్ రీజియన్ నుంచి సౌకర్యం
- ఈ నెల 7 నుంచి 13 వరకు 248 స్పెషల్ బస్సులు


మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థను లాభాల బాటలోకి తెచ్చేందుకు యాజమాన్యం అందివచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సమాయత్తమవుతోంది. సంక్రాంతికి విద్యార్థులకు సెలవులు వస్తున్నాయి. దైవదర్శనాలు, పండుగ సందళ్లు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో రాకపోకలు పెరుగనున్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, వారి సౌకర్యార్థం తెలంగాణ ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లినవారు.. చదువుల నిమిత్తం నగరంలో ఉన్న విద్యార్థులంతా సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఆర్టీసీ 248 ప్రత్యేక (స్పెషల్ బస్సులు) బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది.

ఈ నెల 7 నుంచి 13 వరకు..

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఉట్నూర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. భైంసా డిపో నుంచి మినహాయిస్తే మిగిలిన ఐదు డిపోల వారీగా బస్సుల రాకపోకలు సాగనున్నాయి. ఈ నెల 7 నుంచి 13 వరకు ఆయా డిపోలనుంచి జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులు నడుపనున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి 48, నిర్మల్ డిపో నుంచి 82, ఉట్నూర్ డిపో నుంచి 06, ఆసిఫాబాద్ డిపో నుంచి 38, మంచిర్యాల డిపో నుంచి 74 బస్సులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు బస్సుల ఎసమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు మేనేజర్ , అసిస్టెంట్ మేనేజర్, సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. ఆదిలాబాద్ రీజియన్ నుంచి ఈ నెల 7న 08, 8న 12, 9న 10, 10న 14, 11న 71, 12న 71, 13న 62 బస్సులు నడువనున్నారు.

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు ప్రత్యేక బస్సుల వివరాలు (డిపోలవారీగా)

తేదీ	ఆదిలాబాద్	నిర్మల్	ఉట్నూర్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	07	2	0	02	02
08	02	04	0	02	04
09	02	03	0	02	03
10	02	05	0	02	05
11	15	24	02	10	20
12	15	24	02	10	20
13	10	20	02	10	20

మరిన్ని బస్సులు నడిపే అవకాశం



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటే మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం ఉంది. స్పెషల్ బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. సురక్షిత ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.
– సోలోమన్, రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

నిస్వార్థ సేవకు గుర్తింపు

- సావిత్రీబాయి పూలే అవార్డుకు కడేర్ల వీణ ఎంపిక
- పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా విద్యా బోధన
- ఈ నెల 7న నాగ్‌పూర్‌లో ప్రదానం


కడేర్ల వీణ

కెరమెరి(ఆసిఫాబాద్): నిస్వార్థ సేవకు గుర్తింపు దక్కింది. వందలాది మంది విద్యార్థులకు అక్షర జ్ఞానం అందిస్తూ.. పదేళ్లుగా ఉచిత బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు కడేర్ల వీణ మరో గౌరవం అందుకోనున్నారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రంగయ్య సతీమణి వీణ భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్వచ్ఛంద సేవల్లో పాలు పంచుకుంటున్నారు. పైసా ప్రతిఫలం ఆశించకుండా పదేళ్లుగా విద్యార్థులకు ఉచితంగా బోధిస్తోంది. వీణ సేవలను గుర్తించిన శ్రీ క్షత్రియ కోసరి మాలి సమాజ్(విదార్భ) ఆమెను సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపిక చేసింది. పదేళ్లుగా ఉచిత బోధన, సావర్‌ఖేడాలో నివాసం ఉండటం, తెలుగు భాషపై విద్యార్థులకు పరిజ్ఞానం పెంచడం, అక్షరాస్యత పెంపునకు కృషి చేయడం, సెలవు రోజుల్లో కూడా ఇంటి వద్ద బోధన సాగించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని విద్యారంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా అవార్డు అందించనున్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 7న జరిగే కార్యక్రమానికి వీణకు ఆహ్వానం పంపించారు. విద్యారంగంలో స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా సావర్‌ఖేడా పాఠశాలలో పని చేస్తున్న వీణ.. సావిత్రీబాయి పూలే అవార్డుకు ఎంపికైనట్లు మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెట్కులే సుకుమార్ బుధవారం 'సాక్షి'కి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో కృషి చేస్తున్న 36 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేసి, సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'సింగరేణికి విముక్తి కలిగింది'

- బీఎంఎస్ అధ్యక్షుడు సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో చాలా కాలంగా తిష్టవేసిన సీఎండీ శ్రీధర్‌ను బదిలీ చేయడంతో సంస్థకు విముక్తి కలిగిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆయన బదిలీపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం నస్పూర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయూనియన్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల నుంచి సింగరేణిలో తిష్ట వేసి కంపెనీలో అనేక చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడ్డారన్నారు. రాజకీయ జోక్యంతో సింగరేణి నిధులను దుర్వినియోగం చేయించారన్నారు. దీన్ని ప్రశ్నిస్తున్న తమ లాంటి సంఘం నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఆయన పదవీ కాలంలో కంపెనీలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి నుంచి సీఎస్ఆర్ , డీఎంఎఫ్‌టీ నిధులు ఎక్కడికి వెళ్లాయో లోతుగా విచారణ చేస్తే అసలు విషయాలు వెల్లడవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అల్లంకి వసంత రావు, పాగిడి శ్రీకాంత్, కమలాకర్, కాంపల్లి తిరుపతి, మంచాల రమేష్, మోహన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆదర్శనీయం

- జీఎం సంజీవరెడ్డి


బహుమతులు పొందిన వారితో జీఎం

శ్రీరాంపూర్: చదువు ప్రాముఖ్యతను చాటిన సావిత్రీబాయి పూలే జీవితం మహిళలందరికీ ఆదర్శనీయమని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పూలే 193వ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు విద్య అందించాలని ఉద్యమం చేసిన వారిలో సావిత్రిబాయి పూలే మొదటి మహిళ అన్నారు. అనంతరం ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకు మారి మాట్లాడుతూ సింగరేణిలో మహిళల అభ్యున్నతికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. జీఎం కార్యాలయంలోని మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పూలే వేషధారణలో కుమారి నిర్మలాదేవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం కే.రఘుకుమార్ దంపతులతో పాటు ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవింద రావు, డీజీఎం (ఐఈడీ) చిరంజీవులు, ఎస్సీ లైసెన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ఏరియా సర్వే అధికారి వెంకటేష్, లా మేనేజర్ శిరీషా రెడ్డి, లా ఆఫీసర్ ప్రబంధిత, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ ఎం రాజేశ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నెన్నెల: ఈ నెల 1న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీకాంత్ (29) ఈనెల 1న మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మనస్తాపంతో బావిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నంబాలకు చెందిన శ్రీరామోజు మౌనిక (31)కు గోదావరిఖనికి చెందిన క్రిష్ణమాచారితో వివాహమైంది. దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. మౌనిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్తాపం చెందింది. ఈ నెల 1న నంబాలలోని పుట్టింటికి వచ్చింది. బుధవారం తెల్ల వారుజామున ఇంటి పక్కనే ఉన్న పాత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

టో(తో)ల్ తీస్తున్నారు..

- ఫాస్ట్ టాగ్ లేదని డబుల్ జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మందమర్రి టోల్ ప్లాజా నిర్వాహకులు వాహనదారులను దోపిడీ చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా ఇక్కడ కనిపిస్తున్న టోల్ చీటీలే.. అవును కరీంనగర్ నుంచి వచ్చిన ఓ కారు బెల్లంపల్లి వైపు వెళ్తుండగా మందమర్రి టోల్ ప్లాజా వద్ద కారుకు ఫాస్ట్ టాగ్ లేదని నగదు వరసలో వెళ్లగా ఎగువకు రూ.70తో పాటు అదనంగా రూ.70 జరిమానాతో కలిపి మొత్తం రూ.140 వసూలు చేశారు. తిరుగు ప్రయాణంలో రెండు గంటల అనంతరం మందమర్రి టోల్ ప్లాజాకు రాగానే టోల్ ఫీజు కింద రూ.70, ఫాస్ట్ టాగ్ లేదని రూ.70 అదనంగా మళ్లీ రూ.140 వసూలు చేశారు. అలాగే అదే కారు వెళ్లేటప్పుడు 1,200 కిలోల బరువు చూపించగా తిరుగు ప్రయాణంలో 950 కిలోలు చూపించింది. ఇక రెండు గంటల వ్యవధిలో టోల్ ఫీజుతో పాటు ఫాస్ట్ టాగ్ లేదని రూ. 240 వసూలు చేశారని ప్రయాణికుడు హరి టోల్ ప్లాజా నిర్వాహకులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిర్వాహకులను అడిగితే 'ఎన్‌హెచ్ఏఐ అధికారులను అడుక్కోండి' అనడం కొసమెరుపు.

పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగుల పెన్షన్ పెంపుదలకు కృషి చేయాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.వేణుమాధవ్, సంయుక్త కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ 1998లో పెన్షన్ చట్టం వచ్చిన తర్వాత మూడేళ్లకోసారి పెన్షన్ సమీక్షించి పెంపుదల చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఆ నిబంధనను అమలు చేయడం లేదన్నారు. చాలీచాలని పెన్షన్‌తో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. జూలై 1, 2016 నుంచి పెరిగిన రూ.20 లక్షల గ్రాట్యుటీ సీలింగ్‌ను అమలు చేయాలని, తెలంగాణలోని ప్రముఖ నగరాల్లో రిటైర్డ్ ఉద్యోగుల కోసం కంపెనీ మందులు ఇవ్వడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించాలని కోరారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన సందర్భంగా సీతారామయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే.రాజకుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ హామీలు అమలు చేయాలి'


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు కోరారు. బుధవారం ఆర్కే 6 గనిపై మాట్లాడుతూ శ్రీరాంపూర్, తదితర ప్రాంతాల్లో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ చీకటి ఒప్పందం చేసుకుని ఐఎన్టీయూసీని ఓడించాయన్నారు. ఓడినా, గెలిచినా తామెప్పుడూ కార్మికుల పక్షానే ఉండి పని చేస్తామన్నారు. కార్మికులకు ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం వంటి హామీలను ఏఐటీయూసీ వెంటనే అమలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, జాతీయ సమితి సభ్యులు భీంరావు, నాయకులు ల్యాగల శ్రీనివాస్, వెంకటస్వామి, విజయపాల్‌రెడ్డి, సంతోశ్, సత్తయ్య, జె.నర్సింగ్, ప్రవీణ్‌రాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి


దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట: ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేట, మున్సిపల్ పరిధిలోని 9, 14వ వార్డుల్లో పర్యటించి దరఖాస్తులు పరిశీలించారు. లబ్ధిదారులు అందించే దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి తీసుకోవాలని, రశీదులు అందజేయాలని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎండీవో నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎంపీవో ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: ఇంటి గోడ కూలి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన ఎగ్గి సత్యనారాయణ, కమల దంపతులు బుధవారం ఇంట్లో పనిలో నిమగ్నమై ఉండగా ఇంటి గోడ దంపతులిద్దరిపై కూలింది. విషయాన్ని ఇంట్లోని ఇద్దరు పిల్లలు వెళ్లి స్థానికులకు చెప్పడంతో వారిని బయటకు తీశారు. కమలకు వెన్నుపూసలో దెబ్బ తగలడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


సంఘటన స్థలంలో మృతదేహం

సిర్పూర్(టి): విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన నాగపురి రమేష్ (54) బుధవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పంటకు నీరందించేందుకు వెళ్లాడు. మోటార్ నుంచి నీళ్లు రాకపోవడంతో 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య మాయాబాయి, కుమారుడు ఆకాశ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి'


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం కోఆపరేటివ్ సొసైటీ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని ఎస్పీఎం పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2023 అక్టోబర్ 10న సొసైటీలో కార్మికులకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయగా జిల్లా సహకార సంఘం అధికారి తారామణి స్పందించి నవంబర్ 18న అసిస్టెంట్ రిజిస్ట్రార్ సామ్యూల్ మాథ్యూను విచారణకు ఆదేశించారన్నారు. బుధవారం ఎస్పీఎంలో పనిచేస్తున్న సొసైటీ బాధ్యులు రమేశ్‌కు సహకారం సంఘం తరపున సదానందం మెమో జారీ చేశారన్నారు. 2014 నుంచి సొసైటీలో జరిగిన లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు అన్ని సమర్పించాలని ఆదేశించారన్నారు. నూతన ప్రభుత్వంపై తాము పూర్తిన మ్మకంతో ఉన్నామని, విచారణ సవ్యంగా జరిగి కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు.సమావేశంలో సూర్యప్రకాశ్‌రావు, ఎకె సింగ్, శంకరయ్య, షబ్బీర్, రవి, సునీల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వరకు గడువు పొడిగించారని, నూతన, రెన్యువల్ ఉపకార వేతనాల కోసం విద్యార్థులు కులం, ఆదాయంతోపాటు ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నూతన, రెన్యువల్ ఉపకార వేతనాల దరఖాస్తుల హార్డ్ కాపీలను కళాశాలల యాజమాన్యాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందించాలని, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో www:// telanganaepass. cgg. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆదర్శ ఉపాధ్యాయినులకు సన్మానం


సన్మానం పొందిన ఉపాధ్యాయినులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతి నిర్వహించారు. పట్టణ పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ టీ.సత్యనారాయణ సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. 11 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఉపాధ్యాయినులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అకిరెడ్డి శంకర్, నాయకులు తొంగల రాజేశం, తొంగల శ్రీనివాస్, బగ్గని శేషుకుమార్, కందుల రాజన్న, యువజన నాయకులు సాగర్ వర్మ, మీస రమేష్, అచ్చ శివ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని 'భట్టి'ని కోరిన శేజల్


డెప్యూటీ సీఎంతో గోడు వెళ్లబోసుకుంటున్న శేజల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఆరిజిన్ డెయిరీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సీఏఓ) బోడపాటి శేజల్ డెప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం సచివాలయంలో ఆయనను కలిసి తనపై జరిగిన ఘటనలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య లైంగిక వేధింపులకు గురి చేయడంతోపాటు తమపై దాడులు చేయిస్తున్నారని తెలిపారు. దాడులు చేయించిన మాజీ ఎమ్మెల్యేతోపాటు అతని అనుచరులను అరెస్టు చేయించాలని వేడుకున్నారు. చిన్నయ్య తమపై పెట్టించిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి

లక్సెట్టిపేట: ట్రాక్టర్ పైనుంచి కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన తీగల నరేష్ (34) ఎల్లారంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం పొలంలో దున్నుతుండగా అదుపుతప్పి ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. తలకు వీల్స్ బలంగా తాకడంతో గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

నిషేధాజ్ఞలు పొడగింపు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఇదివరకే అమలులో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 1నుంచి ఫిబ్రవరి 1వరకు పొడగించినట్లు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, అనుమతి లేకుండా డీజే సౌండ్స్, డ్రోన్ కెమెరాలు వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు.